రీ సర్వే రెండవ విడత గ్రామాలలో గ్రౌండ్ ట్రూతింగ్ మార్చి 31 లోపు పూర్తి చేయాలి

: స్పెషల్ సిఎస్, సిఎంఓ

మొదటి విడత గ్రామాలలో స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలి :కలెక్టర్

విశాలాంధ్ర- తిరుపతి : రీ సర్వే ప్రక్రియకు చెందిన గ్రామాల భూముల వివరాలను వెబ్ ల్యాండ్ 2.0 లో నమోదు ఒక వారంలోపు పూర్తి చేయాలని, స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం చేయాలని, రెండవ దశ గ్రామాల గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేసేలా ఉండాలని స్పెషల్ సిఎస్ సిఎంఓ పూనం మాల కొండయ్య అన్నారు. ప్రత్యేక ముఖ్య కార్యదర్శి, సిఎంఓ గారు సిసిఎల్ ఏ స్పెషల్ సి ఎస్ సాయిప్రసాద్, కమిషనర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సిద్ధార్థ్ జైన్ తో కలిసి మంగళవారం సాయంత్రం అమరావతి నుండి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వెబ్ లాండ్ 2.0 నమోదు, స్టోన్ ప్లాంటేషన్, గ్రౌండ్ ట్రుతింగ్, ఫైనల్ ఆర్ ఓ ఆర్ రెండవ విడత రీ సర్వే గ్రామాల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించగా తిరుపతి కలెక్టరేట్ ఛాంబర్ నుండి కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి, జెసి డి కె బాలాజీ తో కలిసి హాజరయ్యారు.స్పెషల్ సిఎస్ సి ఎం ఓ మాట్లాడుతూ రెండవ విడత గ్రామాలకు బౌండరీ హద్దు నిర్ణయం మార్చి 31 లోపు పూర్తి చేయాలని, ఫైనల్ ఆర్ ఓ ఆర్ ఏప్రిల్ 31 లోపు పూర్తి కావాలని అన్నారు. వీడియో కన్ఫెరెన్స్ అనంతరం కలెక్టర్ సంబందిత అధికారులతో, ఏ డి సర్వే జయరాజ్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ రీ సర్వే రెండవ దశ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 208 గ్రామాలకు గాను 140 గ్రామాలలో గ్రౌండ్ ట్రూథింగ్ ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన గ్రామాల్లో మార్చ్ 31 నాటికి పూర్తి చేసేలా ఉండాలని, మిగిలిన అంశాలు గడువులోపు పూర్తి కావాలని అన్నారు. మొదటి విడత గ్రామాల భూముల రీ సర్వే అయిన వాటికి హద్దు రాళ్ళు నాటే ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. అవసరమైన రోవర్లు ఏర్పాటు కావాలని అన్నారు. సంబంధిత భూముల రైతులకు సమాచారం అందజేసి హద్దు రాళ్ళు స్టోన్ ప్లాంటేషన్ తగినన్ని రోవర్ల ఏర్పాటుతో త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. 69 గ్రామాలకు గాను వెబ్ ల్యాండ్ 2.0 లో అప్లోడ్ 23 గ్రామాలు పూర్తి అయ్యాయని తెలుపగా మిగిలిన 46 గ్రామాల వివరాలను త్వరితగతిన గడువులోగా అప్లోడ్ పూర్తి చేయాలని ఆదేశించారు.

నులిపురుగులు రక్తహీనతకు కారణం

ఎంపెడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధీర్ కుమార్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే రక్తహీనతకు కారణమై పిల్లలు శారీరిక మానసిక లోపాలతో ఎదుగుదల లోపిస్తుందని ఎంపెడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కేంద్రాల్లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పాఠశాలకు వచ్చే పిల్లలకు నులిపురుగుల నివారణకు రక్తహీనత లోపంతో బాధపడే వారికి కిషోర్ బాలికలకు కడుపులో నులి పురుగులు ఉన్నట్లయితే వారు శారీరిక మానసిక లోపాలతో ఎదుగుదల సరిగా లేకుండా ఉంటారని, వీటి నివారణకు ప్రతి పిల్లవాడికి 18 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్ర ద్వారా నులిపురుగుల నివారణ సులభంగా నివారించే కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా ఉచితంగా ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పాఠశాలలో పిల్లలకు ఈ మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. బడికి రాని పిల్లలు, కిషోర్ బాలికలను కూడా గుర్తించి వారికి కూడా ఈ మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. తొండమనాడు ఎగువ వీధి, అక్కుర్తి, ముచ్చివోలు, వాంపల్లి, ఓరందూరు, రాచగున్నేరి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్టు ఆయన తెలిపారు. పిల్లలందరికీ విద్యా ర్థులకు నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ 400 మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, లక్ష్మయ్య, గోపి, సరిత, జయ కుమారి, చంద్రశేఖర్, గోపాలకృష్ణ, అంగన్వాడి కేంద్రాల సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, సిహెచ్ఓ ముంతాజ్ బేగం, పీహెచ్ఎం అమ్మనమ్మ, ఎంపిహెచ్ఓ వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్ మునెమ్మ, ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఏఎన్ఎం వాణిశ్రీ, సుమతి, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరునిన్రవూరు శ్రీ భక్తవత్సల పెరుమాళ్‌కు టీటీడీ పట్టువస్త్రాలు

విశాలాంధ్ర - తిరుపతి : తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా, తిరునిన్రవూరులో గల చారిత్రకమైన భక్తవత్సల పెరుమాళ్ ఆలయానికి మంగళవారం సాయంత్రం టిటిడి ఈఓ ఎవి.ధర్మారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. తిరుమల శ్రీ పెద్దజీయర్‌స్వామి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ పెద్దజీయర్‌స్వామివారు ఈ ఆలయానికి ఆధ్యాత్మికపెద్దగా వ్యవహరిస్తున్నారు. స్వామివారి కోరిక మేరకు 2010వ సంవత్సరం నుండి ఈ ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టిటిడి ఆనవాయితీగా శ్రీవారి పట్టువస్త్రాలను కానుకగా సమర్పిస్తోంది. ముందుగా తిరునిన్రవూరులోని శ్రీ పెద్దజీయర్‌స్వామివారి మఠానికి ఈవో చేరుకున్నారు. అక్కడి నుంచి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని శ్రీ భక్తవత్సల పెరుమాళ్‌కు పట్టువస్త్రాలు సమర్పించారు. తిరు అనగా 'శ్రీ లక్ష్మీ' అని, నిన్ర అనగా 'నిలబడి' అని, వూరు అనగా 'ప్రదేశం' అని అర్థం. శ్రీలక్ష్మీదేవి నిలబడి ఉన్న ప్రదేశంగా తిరునిన్రవూరు గుర్తింపు పొందింది. 108 దివ్యదేశాల్లో ఈ ఆలయం ఒకటి. ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు పాల్గొన్నారు.

ప్రసాదాలు తరలించడానికి ప్రత్యేక వాహనం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయ ప్రాంగణంలో గల పోటు నుంచి విక్రయ కేంద్రాలకు ప్రసాదా లను తరలించడానికి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేశారు. ఈ వాహనాన్ని ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పోటు నుంచి విక్రయ కేంద్రాలకు ప్రసా దాలు తరలించడానికి ఇబ్బందులు ఉండటంతో సుమారు రూ.5లక్షలు వెచ్చించి ఎలక్ట్రిక్ వాహనం కొనుగోలు చేసినట్లు ఆయన చెప్పారు. దీని వలన పోటు నుంచి ప్రసాదాలు తరలించేందుకు చాలా సులభంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పోటు ఇంచార్జి మునిరెడ్డి, సూపరిటెండెంటు హిమబిందు, ఆలయ తనిఖీదారు సుదర్శన్ నాయుడు, చైర్మన్ సీసీ సుదర్శన్ రెడ్డి, అర్చకులు కమల్ గురుకుల్, ఆలయ సిబ్బంది అనిల్ కుమార్, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ శత శాతం ఆల్బెండజోల్ 400ఎం.జి మాత్రల పంపిణీ జరగాలి: కలెక్టర్

విశాలాంధ్ర- తిరుపతి : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం- 2023 ను వైద్య ఆరోగ్య శాఖ మరియు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద నేడు జిల్లాలోని 1 సం.నుండి 19 సంవత్సరాల పిల్లలకు అందరికీ మొదటి విడత ఆల్బెండజోల్ మాత్రలు శత శాతం వేయాలని జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఎంజిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు వారి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గల పిల్లలకు, ప్రాథమిక పాఠశాలలోని బడిలోని మరియు బడి బయట పిల్లలకు, ప్రాథమికోన్నత పాఠశాల లోని పిల్లలకు ఏఎన్ఎం ల ద్వారా, ఉన్నత పాఠశాల, రెసిడెన్షియల్ ఆశ్రమ, మోడల్ స్కూల్, కేజీబీవీ, గురుకుల మరియు మైనారిటీ పాఠశాలలోని పిల్లలు మరియు ఇంటర్మీడియట్ విద్యార్థులకు మగ,ఆడ ఆరోగ్య పర్యవేక్షకుల ద్వారా మధ్యాహ్న భోజనం తర్వాత 1సం. నుండి 2 సం.ల పిల్లలకు ఆల్బెండజోల్ 400ఎంజి లో సగం మాత్ర మరియు 2 సం.నుండి 19 సం.ల వయసు గల పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజి ఒక మాత్ర చప్పరిస్తూ మింగేలా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం పిల్లలలో కడుపులోని కొంకి పురుగు, నులిపురుగు, బద్దె పురుగు మరియు గుండ్రని పురుగులను నివారించడం ద్వారా పిల్లల యొక్క ఆరోగ్య వృద్ధి పెంపొందించి తద్వారా ఉన్నత పౌరులుగా ఎదిగేలా చేయడం అని తెలిపారు. సదరు మందుల పంపిణీ వివరాలను ఎన్ డిడి యాప్ నందు ఆన్లైన్ లో ప్రొఫార్మ మేరకు తప్పని సరిగా నమోదు చేయాలని అన్నారు. జిల్లాలోని 2444 అంగన్వాడి కేంద్రాలలోని (0-5సం.) పిల్లలు, ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు వెరసి మొత్తం 2693 లోని (6-15సం.) పిల్లలు, ప్రభుత్వ, ప్రభుత్వం చే గుర్తించబడిన, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఐటిఐ తదితర 158 కళాశాలల లోని (16-19 సం.) పిల్లలు మరియు పాఠశాలలో నమోదు కాని 10-19 సంవత్సరాల బడి బయటి పిల్లలు వెరసి మొత్తం 5295 విద్యా సంస్థలలో సుమారు 4 లక్షల మంది పిల్లలకు ఈ మాత్రలు చప్పరించి మింగేలా ఏర్పాటు చేయడమైనది అని ఈ అవకాశాన్ని అందరు పిల్లలు వినియోగించుకో వాలని సూచించారు. ఇంకనూ మిగిలిపోయిన పిల్లలు ఉంటే ఈనెల 18న వారికి కూడా ఆల్బెండజోల్ మందులు మింగించి వంద శాతం పిల్లలు కవర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇందు కొరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ తగినంత మందులు బఫర్ స్టాక్ తో కలిపి అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు వైద్యాధికారులు సక్రమంగా ఈ విధులను నిర్వర్తించేలా పర్యవేక్షణ ఉండాలని సూచించారు ఈ మాత్రలు వేసుకున్న పిల్లలలో ఏమైనా రియాక్షన్ ఉంటే వారిని సత్వరమే దగ్గరలోని ఆసుపత్రిలో చికిత్సకు తీసుకెళ్లేలా 104, 108 వాహనాలు సిద్ధంగా ఉండాలని అన్నారు. డిఆర్ డి ఎ ద్వారా మహిళా సంఘాలలోని సభ్యులకు ఈ కార్యక్రమం పై అవగాహన కల్పించి 100% పిల్లలు కవర్ అయ్యేలా ఉండాలని సూచించారు. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలు అందరూ కూడా ఇందులో కవర్ అయ్యేలా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పిహెచ్సి వైద్యాధికారులు, మండల విద్యాధికారులు, సిడిపిఓలు పర్యవేక్షించాలని సూచించారు. విద్యాశాఖ వైద్యశాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిఆర్డిఏ, ఎంపిడిఓ లు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు, సంక్షేమ హాస్టల్ అధికారులు తదితర సంబంధిత అధికారులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీహరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిని శాంతకుమారి, డిప్యూటీ డిఎంహెచ్ఓ అరుణ సులోచన, ఆర్ బిఎస్ కే అధికారి డా. హరినాథ్ , మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, విద్యా శాఖ కోఆర్డినేటర్ కిషోర్, వివిధ పట్టణ ఆరోగ్య కేంద్రాల ఆరోగ్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముకు చేరిన బ్యాలెట్ బాక్సులు

నేడు రెండు కేంద్రాల్లో రీపోలింగ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 70. 66 శాతం

ఉపాధ్యాయుల స్థానానికి 89.34 శాతం పోలింగ్ నమోదు

విశాలాంధ్ర- చిత్తూరు: ఉమ్మడి ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రులు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాల పోలైన ఓట్లకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్ లను కట్టదుట్టమైన భద్రత మధ్య స్ట్రాంగ్ రూములో మంగళవారం భద్రపరిచారు . సోమవారం ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ జరిగిన సంగతి తెలిసింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ప్రకాశం నెల్లూరు చిత్తూరు జిల్లా జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి భారీ బందోబస్తు మధ్య బ్యాలెట్ బాక్స్ లను చిత్తూర్ లోని ఆర్ వి సి ఇంజనీరింగ్ కాలేజీ స్ట్రాంగ్ రూములకు తరలించారు. మంగళవారం ఈ బ్యాలెట్ బాక్సును స్క్రూట్మెంట్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరి నారాయణ ఈ ఎన్నికల ప్రత్యేక అధికారులు కోన శశిధర్ ,కాటమనేని భాస్కర ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానానికి 89.34 శాతము, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 70.66 శాతం ఓట్లు పోలైనట్లు ఎన్నికలు అధికారి ప్రకటించారు. ప్రకాశం నెల్లూరు చిత్తూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 27,694 మంది ఓటర్లు ఉండగా అందులో 24, 741 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 3,79 ,810 ఓటర్లు ఉండగా 2,68,387 మంది ఓటర్లు ఓటింగ్లో పాల్గొన్నట్లు వివరించారు. బ్యాలెట్ బాక్స్ లను ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచి సీల్ వేశారు. సోమవారం తిరుపతిలో పోలింగ్ సందర్భంగా చిన్న బజార్ వీధిలోని ప్రభుత్వ బాలికలు ఉన్నత పాఠశాల, సత్యనారాయణపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిగ్గింగ్ జరిగిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం ఈ రెండు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పోలింగ్ అనంతరం ఈ బ్యాలెట్ బాక్స్ లో కూడా చిత్తూరులోని స్ట్రాంగ్ రూమ్ తరలిస్తామని, తదుపరి 16వ తేదీన ఉదయం నుంచి కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

సమష్టి కృషితో కోదండరాముని బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలి

: జేఈవో వీరబ్రహ్మం

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి శ్రీ కోదండరామాలయంలో మార్చి 20 నుంచి 28వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని విభాగాల అధికారులు సమష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కోరారు. ఆలయంలో మంగళవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ, మార్చి 20న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు . ప్రధానంగా మార్చి 22న ఉగాది ఆస్థానం, 24న గరుడ సేవ, 25న హనుమంత వాహనం జరుగుతాయన్నారు. అదేవిధంగా మార్చి 31న శ్రీ సీతారాముల కల్యాణం, మార్చి 30 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు, ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద, వాహన సేవల్లో ఆకట్టుకునేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. విచ్చేసే భక్తులందరికీ తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. బ్రహ్మోత్సవాల గురించి వివిధ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. మెరుగైన పారిశుద్ధ్య ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.సమీక్షలో ఎస్ఇ ఎలక్ట్రికల్ శ్రీ వెంకటేశ్వర్లు, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, గోశాల డైరెక్టర్ డా. హరనాథ్ రెడ్డి, డెప్యూటీ ఈవోలు గోవిందరాజన్, లోకనాథం, శాంతి ఆలయ అర్చకులు ఆనంద కుమార దీక్షితులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్బావ దినోత్సవం

విశాలాంధ్ర - గూడూరు : తిరుపతి జిల్లా గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం జనసేన పార్టీ పదవ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ తీగల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అలాగే వివేకానంద రోడ్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మచిలీపట్నంలో జరుగుతున్న ఆవిర్భావ దినోత్సవ సభకు జనసేన పార్టీ నాయకులు బస్సులో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర రావు మాట్లాడుతూ మచిలీపట్నంలో జరగబోయే ఈ దిగ్విజయ సభ ఈ రాష్ట్ర దశ దిశను నిర్వహించనుందన్నారు. ఈ సభ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. 2024 ఎన్నికలకు సమర శంఖం పూరించబోతున్నారని, 2024 లో జనసేన ప్రభుత్వం ఏర్పడుతుందని జోస్యం చెప్పారు. మచిలీపట్నం వెళ్లేందుకు వాహనాన్ని సమకూర్చిన జనసేన పార్టీ ఎన్ఆర్ఐ యూఎస్ఏ తారక శ్రీనివాస్ ఇండ్ల, శిరీష రామిశెట్టిలకు గూడూరు జనసేన పార్టీ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గూడూరు పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్, గూడూరు మండల అధ్యక్షుడు భాస్కర్, చిలుకూరు మండల అధ్యక్షుడు జమాల్ బాషా, కోట వాకాడు చిట్టమూరు నాయకులు విష్ణు, అక్బర్, రాజా, వెంకయ్య, కోటి క్రాంతి, వంశీ, అవినాష్, శివ, గని, వాసు, కార్యకర్తలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లను వేగవంతం చేయాలి

: కమిషనర్ అనుపమ అంజలి

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి నగరంలో రూపుదిద్దుకుంట్టున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు జరుగుతున్న కొర్లగుంట మెయిన్ రోడ్, చింతలచేను, హిరోహొండా షోరూమ్, అంకురా హాస్పిటల్ ప్రదేశాలను మంగళవారం కమిషనర్ అనుపమ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ తిరుపతి నగరంలో రోజు రోజుకి పెరుగుతున్న జనాభాకి సౌకర్యవంతంగా వుండేలా, అధిక సమయం ట్రాఫిక్ జామ్ తో ఇబ్బందులు పడే వాహనదారులకు అనువుగా వుండేలా మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించడం జరుగుతున్నదన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో బిటి రోడ్లును శరవేగంగా వేయించాలని, కోర్ట్ కేసులు వున్నవాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులు వేగవంతం చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు, ప్లానింగ్ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తి అయితే నగరంలో ట్రాఫిక్ కష్టాలు చాలా వరకు తీరుతాయని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవికుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాలసుబ్రహ్మణ్యం, షణ్ముగం, డిఈలు సంజీవ్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ పై అవగాహన

విశాలాంధ్ర -తిరుపతి : మండలంలోని కమ్మనపల్లి నందు ఏపీ మోడల్ స్కూల్ మరియు కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయము నందు ప్రిన్సిపాల్ అనిత అధ్యక్షతన రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమము లో భాగంగా జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమము మంగళవారం జరిగినది.ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నిర్మూలిద్దాం అని పిల్లలకి ఆల్బెండజోల్ టాబ్లెట్ మింగించడం జరిగినది.ఈ కార్యక్రమంలో సావిత్రి ఆరోగ్య విద్యాధికారి ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తూ నులిపురుగుల వలన రక్తహీనత పోషకాహార లోపం శారీరక మానసిక ఎదుగుదల తక్కువగా ఉండును కావున చేతులు శుభ్రత వ్యక్తిగత శుభ్రత చాలా ముఖ్యమని ఆరుబయట మలవిసర్జన చేయరాదని సానిటరీ లెటరిన్లు వాడాలని బయట వెళ్లినప్పుడు చెప్పులు బూట్లు ధరించాలి అన్నారు కడుపునొప్పి బరువు తగ్గుట నీరసం ఆకలి తక్కువ ఇలాంటి లక్షణములు పిల్లలలో ఉండును ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీఎస్ అనిత హెచ్ఎం రోహిణి టీచర్లు ఏఎన్ఎం పద్మా లక్ష్మి ఆశ అమరావతి పాల్గొన్నారు.

నిఘా నేత్రాల కింద ఇంటర్మీడియట్ పరీక్షలు

విశాలాంధ్ర - కార్వేటినగరం: ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బంధీగా నిర్వహించడానికి సీసీ కెమరాలు ఏర్పాటు చేస్తున్నామని ఆర్కేఎస్సార్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం రాజు అన్నారు. మంగళవారం ఆర్కేఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సిద్ధం చేస్తున్న పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించడానికి ఇంటర్మీడియట్ బోర్డు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని అందులో భాగంగా పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఎక్కడ ఎలాంటి మాస్ కాఫీంగ్ జరగ కుండా చూడాలని ఆదేశాల అందాయని తెలిపారు. అదే విధంగా పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం: తాగునీరు, విద్యుత్ దీపాలు, అలాగే మరుగు దొడ్లు వంటి మౌళిక వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో

భక్తులకు వేగంగా గదుల కేటాయింపు

- గదుల రొటేషన్, దళారి వ్యవస్థ తగ్గింది

- గదుల రిజిస్ట్రేషన్ కౌంటర్లను ప్రయోగాత్మకంగా సి ఆర్ ఓ వద్దకు మార్పు

- ఈవో ఎవి.ధర్మారెడ్డి

విశాలాంధ్ర- తిరుపతి : శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో 5 నుండి 10 నిమిషాల వ్యవధిలో గదులు పొందుతున్నట్లు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వల్ల గదుల రొటేషన్ పూర్తిగా తగ్గిందన్నారు . దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు ఈ టెక్నాలజీ చక్కగా ఉపయోగపడుతుందన్నారు.తెలిపారు. సామాన్య భక్తులు ఎవరైతే గదుల కొరకు పేర్లు రిజిస్ట్రేషన్ సమయంలో ఫేస్ రికగ్నిషన్ చేసుకుంటున్నారో, వారే ఉపవిచారణ కార్యాలయాల్లో గదులు పొంది, ఖాళీ చేసే సమయంలో కూడా నేరుగా వెళ్లి ఖాళీ చేస్తేనే కాషన్ డిపాజిట్ రిఫండ్ చేయడం జరుగుతుందన్నారు. ఒకసారి తమ ఆధార్ కార్డుతో గదులు పొందిన భక్తులు మళ్లీ 30 రోజుల తర్వాతే గదులు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. మార్చి 1వ తేదీ నుండి 12వ తేదీ వరకు గదుల కేటాయింపు ద్వారా అత్యధికంగా రూ.2.95 కోట్ల రాబడి వచ్చిందని తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్, కరెంటు బుకింగ్ లో కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో వసతి కోసం పేర్ల నమోదు కౌంటర్లను ప్రయోగాత్మకంగా త్వరలో సిఆర్ఓ వద్దకు మార్చనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -2 లో భక్తులకు అందించే ఉచిత లడ్డులో కూడా ఫేస్ రికగ్నిషన్ ద్వారా అక్రమాలను అరికట్టినట్లు తెలిపారు. తద్వారా వ్యక్తి లేకుండా లడ్డు టోకెన్ రాదన్నారు. అంతకుముందు మీడియా ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారాఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వల్ల భక్తులు పొందుతున్న సౌకర్యాలను వివరించారు.ఈ సమావేశంలో సిఇ నాగేశ్వరరావు, ఎస్ ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబు, రిసెప్షన్ డిప్యూటీ ఈవోలు హరింద్రనాథ్, భాస్కర్, ఏఈఓ వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు-జిల్లాలో 50 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర -చిత్తూరు: జిల్లాలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి, ఇందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది . జిల్లావ్యాప్తంగా 31,576 మంది ఈ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం సంబంధించి 17,366 మంది, రెండవ సంవత్సరం సంబంధించి 14 ,210 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి . గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించమని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పరీక్షలు బుధవారం నుంచి వచ్చిన నాలుగో తేదీ వరకు జరగనున్నాయి. పరీక్షలసందర్భంగా ఎలాంటి సందేహాలు ఉన్న వాటిని నివృత్తి చేసుకోవడానికి ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ కు18004257635, లేక తిరుపతిలోనే ఆర్ ఐ ఓ కేంద్రంలోని హెల్ప్ డెస్క్8885419096, ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల్లోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం జరగదని అధికారులు తెలిపారు.

జమీందారుల అమ్మవారి తొలి పూజలో పాల్గొన్న మంత్రి పెద్దిరెడ్డి

విశాలాంధ్ర - పుంగనూరు: పట్టణ పరిధిలో ప్రతిఏట జరిగే సూగుటూరు గంగమ్మ జాతర కు ఈ ఏడాది కూడా జాతరను వైభవంగా నిర్వహించడానికి జమీందారులతో కలిసి మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్ రెడ్డి ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది మంగళవారం రోజున సాయంత్రం ఏడు గంటలకు జమీందారుల తొలి పూజతో గంగ జాతర ప్రారంభం అవుతుండడంతో తొలిపూజను జమీందారులు మల్లికార్జున రాయులు సోమశేఖర రావు ఘనంగా పూజా కార్యక్రమాలు అమ్మవారికి నిర్వహించడం జరిగింది ఈ పూజా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం జరిగింది ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకోవడం జరిగిందని ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అలాగే ఈ సంవత్సరం వర్షాలు బాగా కురిసి రైతన్నలంతా బాగుండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అనేకమంది భక్తులు పాల్గొన్నారు.

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - కార్వేటినగరం: కార్వేటినగరం గ్రామదేవతగా విరాజిల్లుతున్న శ్రీబంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పసుపు, బంధనం, పాలు, పెరుగు, తేనే, నారికేళీ జలాలు వంటి సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారి మూల విరాట్ను పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి భక్తులకు సర్వదర్శన భాగ్యం కల్పించారు. మహిళా భక్తులు అమ్మవారికి పొంగళ్లు వండి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి. మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ భక్తుల తీర్థ ప్రసాదాలను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాక్షుడు రంగనాధమొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్పిళ్లై, భక్తులు పలువురు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - రామకుప్పం :మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో మంగళవారం నులిపురుగుల నిర్మూలన పై పాఠశాల లు మరియు అంగన్వాడీ కేంద్రాల విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలనతో రక్త హీనత ను అరికట్ట వచ్చునని అదేవిధంగా విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని నీరు ఎక్కువగా త్రాగాలని తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు కార్యక్రమానికి విజయవాడ ప్రధాన కార్యాలయం నుండి అబ్జర్వరు గా మహేష్ పల్గనడంజరిగిందని తెలిపారు కార్యక్రమంలో వైద్యాధికారులు అల్తాఫ్ హుస్సేన్, శశిధర్, లోకేష్, మరియు వైద్యాధికారిణి సాదియా వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

విశాలాంధ్ర-పలమనేరు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంలో పలమనేరు రూరల్ మండలం పెంగర గుంట హై స్కూల్ నందు అల్బెన్డజోల్ మాత్రలను అన్నము తిన్న తర్వాత ఇవ్వడము జరిగినదనారు.పిల్లలకు ఈ మాత్రలను 15 వ విడతలో సంవత్సరానికి 2 సార్లు ఇస్తామని అందువల్ల కడుపులోని నులి పురుగులు బద్దె పురుగులు కొక్కి పురుగులు నశించి ఆరోగ్య వంతులుగా ఉంటారని తెలిపారు. పిల్లలు అన్నిరంగాల్లో ముందు ఉండే అవకాశము ఉందని ప్రతి ఒక్కరు భోజనానికి ముందు మలవిసర్జన తర్వాత తప్పని సరిగా సబ్బుతో చేతులను శుభ్రము చేసుకోవాలని పిల్లలకు తెలియచేశారు. ఈ కార్యక్రములో మండల వైద్యాధికారి డాక్టర్ అనౌహి, మండల ఆరోగ్య విస్తారణాధికారి జయశంకర్,ఆరోగ్య సిబ్బంది. కుసుమలత, కైరున్, అశ్విని, ఆశాలు ఉమ, సెల్వి, స్కూల్ హెచ్ యమ్, ఉపాద్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్ బెండజోల్ మాత్రలు పంపిణి

విశాలాంధ్ర - వి. కోట : మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం అల్ బెండజోల్ మాత్రలు అందజేశారు. విద్యార్థుల్లో రక్త హీనత, పౌష్టికాహార లోపం తదితర వ్యాధుల నివారణలో భాగంగా మండలంలో 19029 మంది విద్యార్థులను గుర్తించారు. వీరిలో 18458 విద్యార్థులకు మాత్రలు అందజేసినట్లు ఓగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాజేష్ నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ ఎథిక్స్ పై జూనియర్ డాక్టర్లకు అవగాహన అవసరం

విశాలాంధ్ర - కుప్పం : పీ.ఈ.ఎస్ వైద్య కళాశాల కుప్పం నందు మెడికల్ ఎథిక్స్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రామ్ ను జూనియర్ వైద్యులకు నిర్వహించారు. ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ పాసై జూనియర్ వైద్యులుగా పనిచేస్తున్న వైద్య విద్యార్థులు మెడికల్ ఎథిక్స్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రామ్ లో పాల్గొన్నారు . ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ డా.ఎస్.వి.కే ప్రసాద్ రెడ్డి హాజరై జూనియర్ డాక్టర్స్ ను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ... జూనియర్ డాక్టర్స్ కోర్స్ కంప్లీట్ అయి డాక్టర్స్ గా ప్రాక్టీస్ చేసేటప్పుడు పాటించాలిచ్చిన మెడికల్ ఎథిక్స్ గురించి క్షుణ్ణంగా వివరించారు. రోగులతో ఎలా మెలగాలి, రోగియొక్క వివరాలు గోప్యత, సర్టిఫికేషన్ గురించి పూర్తిగా వివరించారు. అనంతరం జూనియర్ డాక్టర్స్ చేత ప్రతిజ్ఞ చేయించారు. వైద్యకళాశాల డీన్ , ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ రావు మాట్లాడుతూ డా.ఎస్.వి.కే ప్రసాద్ రెడ్డి , మెడికల్ ఎథిక్స్ అండ్ అవేర్నెస్ ప్రోగ్రమ్ నిర్వహించడానికి విచేసినందుకు ధన్యవాదాలు తెలిపుతున్నాను అన్నారు. ఈ కార్యక్రమం లో డా.సుజాత, 31వ , 32 వ బ్యాచ్ జూనియర్ డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో పోటీ తత్వం తప్పనిసరి

విశాలాంధ్ర - కార్వేటినగరం: విద్యార్థులకు విద్యా అభ్యాసంలో పోటీ తత్వం పెరిగేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎం. విజయకుమార్ అన్నారు. మంగళవారం డైట్ ఆవరణంలోని ఆదర్శ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నిర్మాణాత్మక మూల్యాంకనం-4 పరీక్షలను ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేడు ప్రభుత్వం నిర్వహిస్తున్న పార్మెటీవ్ పరీక్షల్లో విద్యార్థులు తన సామర్థ్యాలను నిరూపించుకోవాలని సూచించారు. క్రమ శిక్షణ పట్టదలతో విద్యనభ్యసించే విద్యార్థులు రానున్న పోటీ పరీక్షల్లో సత్తాచాటుకో గలరని గుర్తు చేశారు. అలాగే విద్యార్థులకు పలు సూచనలు, సలహాలను ఇవ్వడం జరిగింది. ఎంఈవొ వెంట మోడల్ పాఠశాల హెచ్ఎం గాజుల నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పలువురు ఉన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీనరసిం హస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణ స్వామి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, పూజలు చేశారు .అనంతరం ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని పెద్ద ఎత్తున భక్తులు తిలకించారు.

తిరుపతిలో అన్ని కేంద్రాల రీపోలింగ్ జరపాలి:టిడిపి

విశాలాంధ్ర- చిత్తూరు: తిరుపతిలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం చిత్తూరులో టిడిపి నేతలు సప్తగిరి ప్రసాద్ మోహన్ రాజ్ ,మేషక్, వెంకటేష్ యాదవ్, తదితరులు విలేకరులతో మాట్లాడుతూ సోమవారం తిరుపతిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పార్టీ ఇష్టానుసారంగా రిగ్గింగ్ పాల్పడిందని ప్రజాస్వామ్య ఖూనీ చేసిందని ఆరోపించారు. అధికారుల సమక్షంలోనే వైసీపీ నేతలు దొంగ ఓట్లు రిగ్గింగ్ పాల్పడుతున్న అధికారులు కట్టడి చేయలేకపోయారున్నారు. ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. కనీసం పదో తరగతి కూడా పాస్ కాని వారిని ఓటర్లుగా నమోదు చేసి దొంగ ఓట్లు వేసుకోవడం దురదృష్టకరమన్నారు . వెంటనే అధికారులు తిరుపతి నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు ఆల్బెండ్ జోల్ మాత్రలు పంపిణీ

విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు:- జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆల్బెండ్ జోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారిణి జానకిరావు తెలిపారు. ఈ సందర్భంగా వైద్య అధికారిణి మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకొని క్రమశిక్షణతో వ్యాయామం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పోకల తాతయ్య ఉపాధ్యాయులు వేణుగోపాల్ ,వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్ గా ఆంజప్ప

విశాలాంధ్ర - పెద్దపంజాణి : పెద్దపంజాణి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల అధ్యక్షులుగా ఆంజప్ప ఎన్నికైనట్టు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం ఢిల్లీలో జరిగిన హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మానవ హక్కుల చైర్మన్గా పైడి అంకయ్య నియమించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల మానవ హక్కుల పరిరక్షణకు,సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పెద్దపంజాణి మండలం నిడిగుంట గ్రామానికి ఆంజప్ప రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్గా ఎన్నిక కావడం పట్ల మండలంలోని పలు ప్రజాసంఘాలు,ప్రజా ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - కుప్పం: ఏ.పీ.ఎస్.డబల్యు.ఆర్ (డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులం (బాలికలు)) గురుకుల పాఠశాల / జూనియర్ కళాశాల, కుప్పం మండలం పరమ సముద్రం నందు 5 వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి 2023-24 విద్యాసంవత్సరం కొరకు ఎస్.సి , ఎస్.టీ, బి.సి, ఓ.సి విద్యార్థినుల దరఖాస్తులు అహ్వనిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీ.మల్లేశ్వరి తెలిపారు. ప్రస్తుతం 2022-2023 విద్యాసంవత్సరం లో నాలుగవ తరగతి అభ్యసిస్తున్న విద్యార్థినులు ఐదవ తరగతి కొరకు అదేవిదంగా 10 వ తరగతి చదువుతున్న విద్యార్థినులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కొరకు దరఖాస్తులు చేసుకోవడానికి అర్హులని, ఈ నెల 24 వ తేదీ వరకు ఏపీజీపీసెట్.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్ ఆన్లైన్ వెబ్ సైట్ నందు దరఖాస్తులు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ కొరకు దరఖాస్తు చేసుకొని కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అర్హులైన వారికి నీట్, ఐ.ఐ.టీ , జే.ఈ.ఈ కొరకు సైతం శిక్షణ అవకాశాన్ని పొందవచ్చని అన్నారు. ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రము, విద్యార్థిని ఫోటోతోపాటు ఫోన్ నెంబర్ అవసరమవుతాయని, ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ టీ.మల్లేశ్వరి తెలిపారు.

పాఠశాల సంపులో జింక

సురక్షితంగా అడవిలోకి వదిలిపెట్టిన అటవీశాఖ

విశాలాంధ్ర - వి. కోట : మండల కేంద్రమైన వి. కోట బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ని ఓ నీటి సంపులో మంగళవారం ఉదయం జింక దర్శనమిచ్చింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకొని అక్కడికి చేరుకొన్న అటవి శాఖాధికారులు సంపులో నుండి జింకను సురక్షితంగా వెలికి తీసి సమీపంలోని పశువైద్యశాలకు తరలించారు. గాయాలకు మందు పూసి వైద్యం అందించారు. జింక కు ప్రాణ హాని లేదన్న వైద్యుల సలహా మేరకు జింకను సమీపంలోని అడవిలో వదిలి వచ్చారు. పట్టణానికి సమీపంలో ఉద్యాన పంటల తోటలు ఎక్కువగా ఉండటంతో దారి తప్పి అటుగా వచ్చిన జింకను రాత్రి కుక్కలు తరముకోగా ప్రాణం కాపాడుకునేందుకు ప్రయత్నం లో జింక పట్టణం వైపు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ప్రమాదవశాత్తు. ఇక్కడకు చేరుకొని సంపులో పడిఉంటుందని స్థానిక డీఆర్వో వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డీవార్మింగ్ డే

విశాలాంధ్ర - కుప్పం: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు వైద్య సిబ్బంది కళాశాల జింకా.. లక్ష్మీనారాయణ సూచనల మేరకు అల్బెండజోల్ మాత్రలను విద్యార్థినీ విద్యార్థులు 300 మందికి పంపిణీ చేశారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినికి పారా మెడికల్ డిపార్ట్మెంట్ ఇన్చార్జ్ అధ్యాపకురాలు భార్గవి ప్రతి ఒక్కరి విద్యార్థిని విద్యార్థులు చేత విద్యార్థులచేత అల్బెండజాల్ మాత్రలను మింగించారు. భోజనం తర్వాతనే ఈ మాత్రలను తీసుకోవాలని, ఆరోగ్యం సరిగ్గా లేనివారు వేసుకోకూడదని గుడిపల్లి మం. బెగ్గలపల్లి విలేజ్ హెల్త్ సెంటర్ ఎం.ఎల్.ఎచ్.పీ జాగ్రత్తలను విద్యార్థిని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మాధవి, భార్గవి, ప్రభుదాస్, రామ సుబ్బారెడ్డి, గణేష్, విద్యార్థిని విద్యార్థు పాల్గొన్నారు.

సత్య గంగమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర-పలమనేరు: స్థానిక పట్టణంలోని సత్య గంగమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 2.5 రోజులుగాను రూ.74,511 అదేవిధంగా కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో5.5 రోజులుగాను హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఇందులోరూ.220094ఆదాయం వచ్చినట్లు ఈవో ఆలయ సిబ్బంది తెలిపారు.ఇలా పట్టణంలో ఈ రెండు దేవాలయాలు ప్రసిద్ధిగాంచిన కోరిన కోర్కెలు తీరుతాయని తెలిపారు.

పిచ్చికుక్క సైర్య విహారం- ఇద్దరికి గాయాలు

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు లో మంగళవారం పిచ్చికుక్క సైర్య విహారం చేయడంతో ఇద్దరికి గాయాలయ్యాయి .పంచాయతీ వీధిలోని కోటపల్లి రోడ్డులో 8వ తరగతి చదువుతున్న షేక్ అనీఫ్, పోలీస్ స్టేషన్ ఎదురు వీధిలో 4వ తరగతి చదువుతున్న హెచ్ఎస్ రెహమాన్ ను పిచ్చికుక్క కరవడంతో ఇద్దరి చిన్నారులకు తీవ్రంగా రక్త గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు విద్యార్థులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు రుయా ఆసుపత్రికి పంపారు. కుక్కలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రియుడు కోసం చిత్తూరుకు వచ్చిన జార్ఖండ్ యువతీ

విశాలాంధ్ర -చిత్తూరు: ఫేస్బుక్ ద్వారా పరిచయమైన యువకుడి కోసం జార్ఖండ్ కి చెందిన యువతి చిత్తూరు చేరుకుంది. జార్ఖండ్ నుంచి రైలులో చిత్తూరుకు వచ్చిన యువతి సోమవారం రాత్రి రైల్వేస్టేషన్లో ఉండగా రైల్వే పోలీసులు ఆ యువతని విచారించి వన్ స్టాప్ సెంటర్లో ఆశ్రమం కల్పించారు. ఫేస్బుక్ ద్వారా బెంగళూరు చెందిన యువకునితో ఆ యువతకి పరిచయం ఏర్పడింది. ఇందులో భాగంగా ఆ యువకుడ్ని కలుసుకునేందుకు రైల్లో చిత్తూరుకు చేరుకుంది. చిత్తూర్ రైల్వే స్టేషన్ లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఆ యువతిని పోలీసులు ప్రశ్నించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. తర్వాత రైల్వే అధికారులు యువతని వన్ స్టాప్ సెంటర్ కి తరలించారు. మంగళవారం బెంగళూరులో ఉన్న ఆ యువకునికి ఫోన్ ద్వారా వన్ స్టాప్ సిబ్బంది సంప్రదించగా సరైన సమాచారం ఆ యువకుడు ఇవ్వకపోవడంతో ఈ విషయాన్ని అధికారులకు తెలిపారు.

రాజగోపాల్ మృతికి చల్లా బాబు నివాళి

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం అయ్యావాండ్లపల్లె పంచాయతీ బెస్తపల్లి కు చెందిన టిడిపి నాయకులు రాజగోపాల్ భౌతికకాయానికి పుంగనూరు టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. రాజగోపాల్ మూర్తి పార్టీకి తీరని లోటని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి లెక్కల ధనుంజయ నాయుడు, రామకృష్ణ నాయుడు, ఆన్సర్ భాష, శంకర్ ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతి

నివాళులర్పించిన ఎంపీపీ

విశాలాంధ్ర-పెద్దపంజాణి : మండలంలోని పెద్దారి కుంట గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రవీంద్ర అనారోగ్య కారణంగా మంగళవారం మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఎంపీపీ రెడ్డప్ప,మండల కన్వీనర్ బాగారెడ్డి, ప్రజా ప్రతినిధులు గ్రామ కార్యదర్శి రవీంద్ర స్వస్థలం సోమల మండలం ఆవులపల్లి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి,ప్రభుత్వం తక్షణసాయంగా 25 వేల రూపాయలను మంజూరు చేసిందని ఆ మొత్తాన్ని వారి కుటుంబానికి అందించడం జరిగిందని ఎంపీపీ రెడ్డప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దారి కుంట సర్పంచ్ భాస్కర్, గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు,పవన్ కుమార్, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలతాల్లో

విశ్వం విద్యార్థుల హవా

విశాలాంధ్ర- తిరుపతి : మంగళవారం విడుదలైన కిట్టూరు బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలతాల్లో నలుగురు విశ్వం చిన్నారులు డీ. దేవాన్షి, డీ.వినతి చౌదరి, కే.మాన్విక రెడ్డి, యస్.వర్షిణి లు ఎంపిక అయారు అని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు, విశ్వం విద్యా సంస్థల అధినేత డా.యన్. విశ్వ నాథ రెడ్డి తెలి పారు. ఈ సందర్భంగా విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ 2023 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయిలో 6 మరియు 9వ తరగతిలో ప్రవేశము కొరకు జరిగిన ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్ష మెరిట్ లిస్ట్ ఫలితాలలోను తిరుపతి విశ్వం విద్యార్థులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర స్థాయి మొదటి ర్యాంకుతో పాటు 10 లోపు 7 ర్యాంకుల తో పాటు గణితంలో 150/150 మరియు ఇంటెలిజెన్స్ టెస్ట్ లో 50/50 మార్కులు విశ్వం విద్యా సంస్థల విద్యార్థులు సాధించడం మన రాష్ట్ర విద్యాశాఖకే గర్వకారణమని తెలియజేశారు.పోటీ పరీక్ష ఏదైనా విశ్వం విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధిం చడం ఆనవాయితీగా మారింది అని తెలియజేశారు, గత 33 సంవత్స రాలుగా సంచలన ఫలితాలు సాధించి రికార్డులు తిరిగరాయడం తమ విద్యార్థుల ఫలితాలతో సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ విద్యే ప్రథమ ధ్యేయంగా బోధి స్తున్నటువంటి అధ్యాపక బృందానికి విద్యార్థినీ విద్యార్థుల తల్లిదం డ్రులకు సంస్థ అధినేత కృతజ్ఞతలు తెలియజేశారు. స్ఫూర్తిదాయకమైన విద్యను అందిస్తూ విజయ సాధనకు తోడ్పడటం విశ్వం విద్య సం స్థలకు సాధ్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ యన్. విశ్వచందన్‌రెడ్డిమరియు ఉపాధ్యాయులు విద్యార్థుల్ని అభినందించారు.

తిరుపతి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి

విశాలాంధ్ర- తిరుపతి : మంగళవారం రోజున స్థానిక తిరుపతిలోని వరదరాజనగర్ నందుగల యానాది కాలనీ లోని పేద పిల్లలకు తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమినేని మునికృష్ణ నాయుడు ఆధ్వర్యంలో పిల్లలకు ఉచి తంగా విద్యా సామాగ్రి ,ఆరోగ్య సంరక్షణకు టూత్ పేస్టులు, బ్రష్షులు, సోపులు, 10 వేల రూపాయలు విలువ చేయు వస్తువులు క్లబ్ తరఫున ఉచితంగా వితరణ చేయడం జరిగినది .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి పట్టణంలో ఇక్కడ ఉన్నటువంటి పేద పిల్లలను వి సపోర్టు చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తహసనున్నీసా బేగం పిల్లలకు కావాల్సిన మౌలిక వస్తువులు కల్పిస్తూ వారికి ఉచితంగా విద్యను కూడా అందించడం జరుగుతున్నది. ఈ సందర్భంగా క్లబ్ తరఫున ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలను కొని యాడడం జరిగినది. ఈ కార్యక్ర మానికి కార్పొరేటర్ నరేంద్ర కుమార్ విచ్చేసి లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. వీ సపోర్ట్ ట్రస్ట్ చైర్మన్ తహసునీన్నీసా బేగం మాట్లాడుతూ సేవలోనే సంతృప్తి ఉందన్నారు. అందు కనే తాను తన కుటుంబ సభ్యుల కన్నా ఇక్కడ ఉన్నటువంటి పేద పిల్లలను చేరదీసి వారికి మంచి భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు .అనంతరం విద్యార్థు లకు విద్యా సామగ్రి ,ఆరోగ్య సంరక్షణ సా మాగ్రి అందించడం జరిగి నది.ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబి నెట్ అదనపు కార్యదర్శి డాక్టర్ కే .రాజేంద్రప్రసాద్, కార్యదర్శి చిత్రమోహన్, ట్రెజరర్ ముబా రక్‌భాష, సభ్యులు:మేరీ,లోకేష్‌బాబు, పద్మకళ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాం

విశాలాంధ్ర - ఏర్పేడు : మండలం పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని డాక్టర్ అభిజ్ఞా ఈరోజు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పాపా నాయుడు పేట జిల్లా పరిషత్ హై స్కూల్ నందు పిల్లలకు నులిపురుగుల సంక్రమణ ,నివారణ ,చికిత్స, తదితర అంశాలపై అవగాహన కల్పించడం జరిగినది. హెల్త్ ఎడ్యుకేటర్ టాటా బాయ్ మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత మరియు పరిసరాల శుభ్రత లోపించడం కారణంగా భోజనానికి ముందర మలవిసర్జన తర్వాత చేతులు సబ్బుతో కడుక్కోకపోవడం నులిపురుగుల ద్వారా రక్తహీనతకు కారణమవుతున్నారని తెలిపారు అదేవిధంగా చేతులను భోజనానికి ముందర మలవిసర్జన తరువాత ఎలా శుభ్రం చేసుకోవాలా అని శిక్షణ ఇచ్చారు మంచి అలవాట్లు మంచి పౌష్టికాహారము తీసుకోవడం వలన రక్తహీనత లేకుండా పిల్లలు శారీరకంగా మానసికంగా ఎదుగుదల సక్రమంగా ఉంటుందని ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నతమైన ఫలితాలు సాధించడానికి విద్యార్థులు చురుకుదనంతో ముందంజలో ఉంటారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో బై బై వామ్స్‌అనే నినాదం పిల్లల చేత పలికించడం జరిగినది ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ జయ కుమార్ రెడ్డి మరియు సూపర్వైజర్ మంజుల ఏఎన్ఎం ఉష కవిత సులోచన తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలలో గూడూరుకు తృతీయ స్థానం

విశాలాంధ్ర - గూడూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో టైక్వాండో సబ్ జూనియర్ పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం జిల్లా, ఎలమంచిలి వాగ్దేవి జూనియర్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సబ్ జూనియర్,5వ కాడేట్ ఇంటర్ డిస్టిక్ పోటీలలో గూడూరు కు చెందిన మూర్తేష్ సాయి సింగ్ తృతీయ స్థానం సాధించాడు. గూడూరు పట్టణ ఎగువ వీరారెడ్డిపల్లికి చెందిన జస్వంత్ సింగ్, ఝాన్సీ రాణి దంపతుల కుమారుడు మూర్తేష్ సాయి సింగ్ రాష్ట్ర తైక్వాండో పోటీలలో తన ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని గెలుచుకున్నాడు. ఇంతటి ప్రతిభ కనబరిచిన మూర్తిష్‌సాయిసింగ్‌నుతైక్వాండోమాస్టర్‌అభినందించారు. భవిష్యత్తులో మరెన్నోబంగారుపథకాలను గెలుచుకొని గూడూరుకు, తన తల్లిదండ్రులకుమంచిపేరుతీసుకుని రావాలని ఆయన ఆకాంక్షించారు.

విద్యార్థులూ...! విజయీభవ

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 58,750మంది విద్యార్థులు

విశాలాంధ్ర-తొట్టంబేడు : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కాను న్నాయి. ఈ పరీక్షలు వచ్చే నెల 4వ తేదీ వరకు జరుగనున్నాయి. ఇంటర్మీడియట్ పరీ క్షల కోసం తిరుపతి జిల్లా వ్యాప్తంగా 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి, ద్వితీయ సంవత్సరాలకు సంబంధించి 58,750మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరగడానికి జిల్లా అధికార యంత్రాగం అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నో ఆశలతో... బంగారు భవిష్యత్తు కోసం పరీక్షలు రాస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'విశాలాంధ్ర' ఆల్ ది బెస్ట్ చెబుతోంది. విద్యార్థులు తొందరపాటు పడకుండా... మానసిక ఒత్తిడికి గురికాకుండా... ప్రశాంతంగా పరీక్షలు రాసి అందరూ ఉత్తీర్ణులు కావాలని 'విశాలాంధ్ర' కోరుకుంటోంది. ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం పరీక్షలు 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. 9గంటలు దాటిన తరువాత ఒక్క నిమిషమైనా సరే పరీక్షకు అనుమతించరు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మహిళా పోలీసులు కూడా అందుబాటులో ఉంటారు. ఉదయం 6 గంటల నుంచే పరీక్షా కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. పరీక్షా సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు తప్ప కుండా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఇక వైద్య ఆరోగ్య శాఖ వారు వైద్య శిబిరం ఏర్పాటు చేయడంతో పాటు... ఓఆర్ ఎస్ అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. పోలీస్ స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరిచే బాధ్యత సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లపై ఉం టుంది. ముందు జాగ్రత్త చర్యగా పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని అధికారులు ఇప్పటికే ఆదే శించారు. జిల్లా కేంద్రమైన తిరుపతిలోని ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి రెవెన్యూ, పోలీసు, విద్యాశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించవలసి ఉంటుంది. పరీక్షల్లో కాపీయింగ్ కు పాల్పడకుండా ఉండటానికి ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. ఇన్విజిలేటర్లు, వైద్య సిబ్బందితో సహా ఎవరికి కూడా మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదు. వీటితో పాటు పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు, బ్లూటూత్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. పోలీసు సిబ్బంది, అధికారులు ముందుగా తనిఖీ చేసి లోపలకు పంపాల్సి ఉంటుంది. పరీక్ష గదిలో కాకుండా బయట ఉదయం పరీక్ష ప్రారంభం అయిన సమయంలో ఉదయం 9 నుండి 9.30గంటల మధ్య మాత్రమే పరీక్ష విధానంపై ఇంటర్మీడియేట్ బోర్డు వారు సరఫరా చేసిన ఆండ్రాయిడ్ కాని ఫోన్ ద్వారా మాత్రమే చీఫ్ సూపరింటెండెంట్ నిబంధనల మేరకు పై అధికారులతో సంప్రదించుటకు అనుమతి ఉంటుంది. ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు వాటిని సత్వరమే జిల్లా కేంద్రంలో ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారి వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూముకు సమాచారం అందించాల్సి ఉంటుంది. జిల్లా కంట్రోల్ రూములో రెవెన్యూ నుంచి డిప్యూటీ తహసీల్దారు, పోలీసు, సంబంధిత విద్యాశాఖ అధికారులు ఉంటారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అన్ని ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాటుతో జిల్లా కేంద్రం నుంచి... రాష్ట్ర కేంద్రం నుంచి పరీక్ష సరళిని పరిశీలిస్తూ ఉంటారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విధులకు హాజరైన అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా... మాల్ ప్రాక్టీస్ కు సహకరించినా క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. గతంలో మాల్ ప్రాక్టీస్ చేసినట్లు ఆరోపణలు ఉన్న ఇన్విజిలేటర్లను పరీక్షల విధుల నిర్వహణ కేటాయించకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇలా జిల్లా అధికార యంత్రాంగం ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సిద్ధమైంది. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని అదికారులు కోరుకుంటున్నారు.

17న విజయవాడలో స్కీం వర్కర్ల సామూహిక ధర్నా

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

విశాలాంధ్ర- తిరుపతి : రాష్ట్రంలో వివిధ స్కీంలలో పనిచేస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్చి 17వ తేదీన విజయవాడలో జరుగు సామూహిక ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడి ఆశ మిడ్ డే మీల్స్ తదితర కార్యకర్తలకు కనీస వేతనాలు ఇవ్వలేదని, పని భద్రత లేదని, పని భారం పెరిగిందని, వీరిపై అధికారులు రాజకీయ నాయకుల వేధింపులు ఎక్కువ అయ్యాయని పేర్కొన్నారు. చేసిన పనికి కూడా సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని సంవత్సరాలు తరబడి టిఏ బిల్లు పెండింగ్‌లో ఉన్నాయని దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యలన్నీ ఇప్పటికే పలు సందర్భాల్లో స్థానికంగా ఆయా కార్యాలయాల వద్ద నిరసనలు తెలియజేసి అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యలు పరిష్కారం చేయకపోగా పట్టించుకోవ దంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి అంగన్వాడీలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కన్నా వెయ్యి రూపాయలు అధికంగా ఇస్తామన్నారు, అలాగే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆశలకు పని భారం తగ్గిస్తామని మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని చెప్పారు. అయితే ఇప్పటివరకు ఈ హామీలు ఆచరణలో పెట్టకపోగా కార్మికుల పొట్ట కొట్టే చర్యలు చేస్తున్నారని ఆరోపించారు. ఈనెల 14 నుండి జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో చర్చించి కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఈనెల 17వ తేదీన అన్ని రంగాల కార్మికులు విజయవాడలో జరుగు సామూహిక ధర్నాలో పాల్గొని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని భావిస్తున్నామని దీనికి కార్మిక లోకం తరలిరావాలని కోరారు.

మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకే బ్యాంకు లింకేజ్ రుణాలు

కెనరా బ్యాంకు అగ్రికల్చర్ రీజనల్ సెక్షన్ మేనేజర్ ఎన్టి నాయక్

విశాలాంధ్ర- సత్యవేడు: స్వయం సహాయక సంఘాలకు తక్కువ వడ్డీకే బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడం జరుగుతుందని కెనరా బ్యాంకు అగ్రికల్చర్ రీజినల్ సెక్షన్ మేనేజర్ ఎన్టీ నాయక్ చెప్పారు. మంగళవారం తిరుపతి జిల్లా సత్యవేడు వైయస్సార్ క్రాంతి పద కార్యాలయంలో వైయస్ఆర్ క్రాంతి పదం ఏపి ఎం స్వర్ణలత ఆధ్వర్యంలో వివో లీడర్ల సమావేశం జరిగింది.ఈ సందర్భంగా కెనరా బ్యాంకు అగ్రికల్చర్ అధికారి ఎన్టి నాయక్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేయడానికి కెనరా బ్యాంకు తలుపులు ఎప్పుడు తెరిచే ఉంటుంది అన్నా రు. మిగిలిన బ్యాంకులతో పోలిస్తే కెనరా బ్యాంకులో స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలపై కేవలం 9.06 శాతమే వడ్డీ చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.కెనరా బ్యాంకులో స్వయం సహాయక సంఘాలు పొదుపు చేస్తూ బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకోవడం వల్ల ఇతర ప్రయోజనాలు కూడా ఉందన్నారు. రుణాలు తీసుకుంటున్న మహిళా సంఘం కుటుంబాలలో వారి వారి వృత్తుల అనుసరించి అవసరమైన పరికరాలను మిషన్లు కొనుగోలు చేయడానికి రుణ వసతి కూడా కల్పించడం జరుగుతుందన్నారు.దీంతోపాటు స్వయం సహాయక సంఘాలలో ఎస్సీ ఎస్టీ కుటుంబ పిల్లల చదువులకు సంబంధించి మెరిట్ విద్యార్థులకు ఉపకార వేతనాలు కూడా మంజూరు చేస్తున్నట్టు ఆయన గుర్తు చేశారు.ఇప్పటికే మహిళ సాధికారత కోసం కెనరా బ్యాంకు కొన్ని పథకాలను అమలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇవన్నీ కూడా పదిమంది మహిళా సభ్యులతో కలిసి సంబంధిత అధికారులతో గ్రూపుగా ధ్రువీకరణ పొందిన తర్వాత కెనరా బ్యాంకులో పొదుపు చేసుకోవలసి ఉంటుంది అన్నారు.సత్యవేడు కెనరా బ్యాంకు మేనేజర్ హరీష్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు రుణాలు మంజూరులో ఉత్తమ సేవలను అందించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నామన్నారు.ఇతర బ్యాంకుల్లో మహిళా సంఘాలు కొనసాగుతున్న అక్కడ తీసుకున్న రుణాలను పూర్తిగా చెల్లించి లావాదేవీలను నిలుపుకున్న తర్వాత కెనరా బ్యాంకులో బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడానికి అభ్యంతరము లేదన్నారు.స్వయం సహాయక సంఘాల రుణాలు చెల్లింపు ఆధారంగా వారికి ఎంతైనా తిరిగి బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడానికి పరిమితి లేదన్నారు.ఈ అవకాశాన్ని స్వయం సహాయక సంఘాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాల న్నారు. అందువల్ల స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లీకేజీ రుణాలు ఇవ్వడానికి కెనరా బ్యాంకు ముందుంటుందన్నారు.ఈ కార్యక్ర మంలో వైయస్సార్ క్రాంతి పథకం కోఆర్డినేటర్లు వలని,జీవ,అకౌంటెంట్ నందిని,పలువురు వివో లీడర్లు, సంఘమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ రెడ్డి కళాశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండల పరిధిలో గల సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. తొట్టంబేడు-2 సచివాలయం ఆరోగ్యశాఖ సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కళాశాలలోని విద్యార్థులకు నులిపురుగుల గురించి అవగాహన కల్పించారు. వారికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కంభం యశోద, కరస్పాండెంట్ డాక్టర్ సి. రాజగోపాల్ రెడ్డి, సచివాలయ ఏఎన్ఎం కె. సుధ, ఎంసి హెచ్‌పి ఎం. భారతి, ఆశా వర్కరు మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్ఓబీకి ఫైనాన్స్ క్లియరెన్స్ ఇవ్వండి

ఆర్థిక శాఖ సెక్రటరీకి ఎమ్మెల్యే వినతి

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు ఫ్లైఓవర్ పనుల కోసం నిధుల కేటాయింపుకు ఫైనాన్స్ క్లియరెన్స్ ఇవ్వాలని కోరుతు గూడూరు ఎమ్మెల్యే మంగళవారం ఆర్థిక శాఖ చీఫ్ సెక్రటరీ రావత్ ను కలిసి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు మాట్లాడుతూ రాష్ట్ర రాజదాని అమవతి సెక్రెటేరియట్‌లో ఫైనాన్స్ సెక్రటరీ రావత్ ని కలిశామన్నారు. గూడూరు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి చెప్పారని, గూడూరు ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడంలో భాగంగా ఆర్థిక శాఖ నుండి అనుమతి మంజూరు చేయాలని కోరామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు : ప్రగతి సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ పుట్టినరోజు సందర్భంగా గూడూరు బాలాజీ నగర్ లోని ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం 50 మంది నిరుపేద మహిళలకు చీరలు, బిరియానీ పంపిణీ చేశారు. అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనుంజయ రెడ్డి, సెక్రటరీ జి చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీ కే. శ్రీనివాసులు, వేమారెడ్డి సురేంద్రనాథ్ రెడ్డి, వాకాటి రామ్మోహన్, రమేష్, పీడీ కరిముల్లా, శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, వీఆర్ గ్రానైట్ ప్రభాకర్, రాము, రిటైర్డ్ ఎస్ఐ ప్రభాకర్, మెడనూరు సురేష్ రెడ్డి, పూర్ణ చంద్ర, పిల్లల శీను, కుమార్ నాయుడు, నాగరాజు, కోట వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, రాఘవ, శీను, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - పాకాల : గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం పాకాల మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని దామలచెరువు గ్రామపంచాయతీ బందార్లపల్లి సమీపంలోని మామిడి తోటలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మామిడి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లుగా పడి ఉన్నాడు. అయితే దారం కిందికి వేలాడుతూ ఉండడంతో అతని మృతిపై అనుమానాలు కనిపిస్తున్నాయి. ఈ సంఘటనపై రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాలాంధ్ర తిరుపతి జిల్లా

కాట్రకాయలగుంటే కన్నీరు పెడుతోంది

సముద్రాల లక్ష్మణయ్య తుదిశ్వాసతో విషాదం

విశాలాంధ్ర-తొట్టంబేడు : తమ పల్లె వాసి... తమతో కలసి జీవించిన వారు... పల్లె వీధుల్లో తిరిగిన వారు... పేరు పేరునా పలకరించే స్నేహశీలి... జన్మభూమికే వన్నె తెచ్చిన గొప్ప పండితులు మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మయ్య తమను విడిచి సోమవారం రాత్రి కానరాని లోకాలకు తరలి వెళ్లడంతో కాట్రకాయగుంటే కన్నీరు పెడుతోంది. ఆయన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ పల్లె వాసులందరూ విషాదంలో మునిగి పోయారు. అలాంటి మేధావి తమ పల్లెకు చెందిన వారు కావడం తమకెంతో గర్వకారణం అంటున్నారు. మహా మహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం కాట్రకాయలగుంటలో 1939 జూన్ 8న జన్మించారు. సుబ్బమ్మ, పాపానాయుడు ఈయన తల్లిదండ్రులు. ఈ దంపతులకు నలుగురు కుమారులు కాగా... సముద్రాల లక్ష్మణయ్య రెండో వారు. 1944లో ఈయన చదువు కోసం వ్యాసాశ్రమంలో చేరారు. వెనుకబడిన వర్గాల వారు కూడా సంస్కృతం ర్చుకోవాలనే ఉన్నతాశయంతో మళయాళస్వామి వ్యాసాశ్రమంలో సంస్కృత పాఠశాల ఏర్పాటు చేశారు. ఈ సంస్కృత పాఠశాలలో సముద్రాల లక్ష్మణయ్య మొదటి బ్యాచ్ విద్యార్థి. ఈయన వ్యాసాశ్రమంలోనే 10వ తరగతి వరకు చదువుకున్నారు. ఆ తరువాత ఉన్నత విద్యకోసం తిరుపతికి వెళ్లారు. సముద్రాల లక్ష్మణయ్య తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ సంస్కృతంలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆ తరువాత ఆయన టీటీడీకి చెందిన ప్రాచ్యకళా శాలలో అధ్యాపకులుగా పని చేశారు. అదేవిధంగా టీటీడీ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శిగా... పురాణేతిహాస ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా విశేష సేవలందించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రచురించిన అనేక విశిష్ట గ్రంధాలను సరిదిద్దడంలో లక్ష్మణయ్య కృషి మరువలేనిది. భగవద్గీత ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా పనిచేశారు. వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం ప్రత్యేకాధికారిగా, టీటీడీ ప్రచురణలకు సంపాదకులుగా వ్యవహరించారు. అన్నమాచార్య సంకీర్తనా మృతము, హిందూ ధర్మ పరిచయం, భర్తృ హరి సుభాషితం, శ్రీమలయాళయతీంద్ర ఉపదేశామృతం, శ్రీమలయాళస్వామి జీవిత చరిత్ర, రఘువంశము, దశకుమార చరితం, అమరవాణి, యోగవాసిష్ఠం వంటి అనేక గ్రంథాలు ఈయన ప్రచురించారు. కొన్ని వేల పుటల సా హిత్యం సృష్టించారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం నుంచి వాచస్పతి బిరుదు అందుకున్నారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ నుంచి ఉత్తమ పండిత పురస్కారం అందుకున్నారు. తిరుపతిలోని అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, మాడభూషి అనంతశయనం సంస్థ నుంచి అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. తన భాష, సాహిత్యనిధిని ఎందరికో పంచారు. తన స్వగ్రామమైన ఏర్పేడు మండలం కాట్రకాయల గుంటలో ఈయన మళ యాళ స్వామి పేరిట జ్ఞానమందిరం నిర్మించారు. ఇక్కడ ఎన్నో గ్రంథాలను అందుబాటులో ఉంచారు. ఈ జ్ఞానమందిరం కాట్రకాయలగుంట వారికి ఎంతో ఉపయోగప డుతోంది. ఎంతోమంది ఈ జ్ఞానమందిరానికి వెళ్లి పుస్తకాలను చదువుతూ జ్ఞాన నిధి సంపాదిం చుకుంటుంటారు. భావి తరాలకు కూడా ఇది ఎంతో ఉపయోగపడునుంది. సముద్రాల లక్ష్మణయ్య సంస్కృత సాహిత్యాన్ని బాగా మధిం చారు. తెలుగు కవి గుర్రం జాషువా సాహిత్యమంటే తనకు చాలా ఇష్టమని చెబుతూ ఉండేవారు. వ్యక్తిగా ఎప్పుడూ ప్రసన్న వదనంతో ఉండేవారు. ఈయన భేషజం లేని గొప్ప వ్యక్తి. మళయాళ స్వామి శిష్యరత్నం. సముద్రాల లక్ష్మణయ్య కాషాయం ధరించని రుషి. ఇలాంటి గొప్ప వ్యక్తి కాట్రకాయల గుంట ప్రజలకు దూరం కావడం జీర్ణించుకోలేక పోతున్నామని వారు అంటున్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారు కోరుకుంటున్నారు.

మహిళలు ప్రతి రంగంలో కూడా సత్తా చాటుతున్నారు : పవిత్ర రెడ్డి

విశాలాంధ్ర - రేణిగుంట : మహిళలు ప్రతి రంగంలో కూడా సత్తా చాటుతున్నారని వైకాపా రేణిగుంట మండల ఇంఛార్జి బియ్యపు పవిత్ర రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా రేణిగుంట టౌన్ లోని రైల్వే ఇన్స్టిట్యూట్ లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ వారు నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పవిత్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవిత్ర రెడ్డి మాట్లాడుతూ మహిళలను కేవలం మహిళా దినోత్సవం ఒక రోజు గౌరవించడం కాదని, ప్రతి రోజు మహిళలను గౌరవించాలన్నారు. మన రైల్వే లో మొదటి లోకో పైలట్ గా ఉద్యోగం చేస్తున్న సురేఖ యాదవ్ మనందరికీ ఎంతో ఆదర్శధాయకం అన్నారు. మహిళలు ప్రతి రంగంలో కూడా సత్తా చాటుతున్నారని తెలిపారు. మన జగనన్న ప్రభుత్వం మహిళల రక్షణ కోసం దిశ చట్టం తీసుకొచ్చారన్నారు. ఈ దిశ ఆప్ ద్వారా ఎంతో మంది మహిళలు కూడా రక్షింపడ్డారని అన్నారు. మన ఇంట్లో ఆడ బిడ్డకు ఎ విధంగా జాగ్రత్తలు చెప్తామో అదేవిధంగా బయట వెళ్లే అబ్బాయిలకు కూడా బయట మహిళలో కూడా మీ అమ్మ ని అక్క నీ చూడాలని, వారిని కూడా గౌరవించాలి అని మనం ఎపుడు అయితే అబ్బాయి కి చెప్తామో అపుడు ఆడ పిల్లలు పై కూడా ఎలాంటి అరాచకాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. మన ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో మహిళలను అభివృధి చేయాలని ఉద్దేశంతో ప్రతి ఒక పథకం మహిళలకే అందచేస్తునారని అన్నారు. అనంతరం రైల్వే ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేచేశారు.ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపిపి హరిప్రసాద్ రెడ్డి , గుంతకల్ రైల్వే ప్రెసిడెంట్ బాబు, మాధవి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పం చ్ నగేష్, పట్టణ అధ్యక్షులు ప్రభాకర్, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, వార్డు మెంబర్ ఈశ్వరి వైఎస్ఆర్సీపీ నాయకులు మరియు కార్యకర్తలు రైల్వే ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాలకు డీజిల్ ఇంజిన్ వితరణ

విశాలాంధ్ర- సత్యవేడు: తమ కార్పొరేట్ సామాజిక చర్యల్లో భాగంగాశ్రీసిటీలోని ఇసుజు పరిశ్రమ సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగానికి 4 లక్షల రూపాయలు విలువచేసే అధునాతన 4-స్ట్రోక్ బిఎస్-6 డీజిల్ ఇంజిన్ నువితరణగా ఇచ్చింది. మంగళవారం కళాశాల ఆవరణలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇసుజు ఇంజనీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్ రాజేష్ మిట్టల్ పాల్గొని,ఇసుజు-ఐఎంఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ ఆర్) కెనెడీ,రాష్ట్రసాంకేతిక విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ సమక్షంలో కళాశాలకు అందచేశారు.ఈ సందర్భంగా రాజేష్ మిట్టల్‌మాట్లాడుతూ,ఉత్తమ ఇంజనీర్లను తీర్చిదిద్దడం తమ బాధ్యతగాఈ ఇంజిన్ ఇస్తున్నట్లుపేర్కొన్నారు. ప్రత్యక్ష విద్యాభ్యాసానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కెనెడీ మాట్లాడుతూ కళాశాలలు, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించేందుకుఈ తరహా వితరణలతోపాటువిద్యార్థులకు పారిశ్రామిక శిక్షణ, ఉద్యోగ కల్పనకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇసుజు ఫ్యాక్టరీ మేనేజర్ గోపాల్ కృష్ణన్ ఇంజిన్ ఉపయోగాలు, దానిని ఎలా ఉపయోగి ంచాలి, తీసుకోవాలిసినజాగ్రత్తల గురించి అధ్యాపకులు, విద్యార్థులకు వివరించారు.పాలిటెక్నిక్ మెకానికల్ విద్యార్థులు ఇంజిన్ టెక్నాలజీ గురించి బాగా అర్థంచేసుకోవడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందనిఆర్జెడి నిర్మల్ కుమార్ అన్నారు. ఇంజిన్‌వితరణతో పాటు విద్యార్థులకుపరిశ్రమ శిక్షణ, ఉద్యోగాలు ఇస్తూసహకరిస్తున్న ఇసుజు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలి పారు.ఇసుజు సీఎస్సార్ చర్యలనుశ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో అభినందించారు.రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకుపరిశ్రమ, కళాశాలలఅనుసంధానానికి శ్రీసిటీ పరిశ్రమలు చూపుతున్న చొరవ పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చర్యల ఫలితంగా ఖచ్చితంగా పాలి టెక్నిక్ విద్యార్థులు తమ సాంకేతిక విద్యా నైపుణ్యాన్ని పెంపొందించుకొని శ్రీసిటీలోని విస్తృత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారని ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

కంచర్ల గెలుపు ఖాయం : మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ గెలుపు ఖాయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం గూడూరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు చెబుతున్నామన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి గెలుస్తారని, ఓటర్లు ఇదే చెప్పారన్నారు. ఈ సమావేశంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, బిల్లు చెంచురామయ్య, భాస్కర్ రెడ్డి, ఎండీ. అబ్దుల్ రహీమ్, ఇశ్రాయిల్ కుమార్, వాటంబేటి శివకుమార్, అల్లీ హుస్సేన్, పిల్లెళ్ల శ్రీనివాసులు, కోటేశ్వరరావు, చంద్రమౌళి, పెంచలయ్య, సందీప్ పాల్గొన్నారు.